
A.S.Murty

# క్షమిస్తావు కదూ?

**ఎమ్. వెంకటరావు**

**కలిసిన మనసులే పెళుసుగా కనిపిస్తాయి. విరబూసిన మమతలే, మధుసౌరభాల్ని విరజిమ్ముతాయి. మధుకరుని ఆరాటం మకరందం ఎడదనింపుకున్న కుసుమ కన్నెకే అవగతం అవుతుంది. మమత, మధువులేని పూవుపై మధుకరుడు మక్కువ చూపడు.**

"కింగ్ ఆఫ్ ది బ్యూటీ వచ్చాడేవ్" అంది లలిత, జానకి కాలు తొక్కుతూ రామారావు క్లాసుకు రాగానే.

"వాడి మొహం. అంతకంటె అందగాళ్ళు లేరేమిటి?" అంది జానకి నిర్లక్ష్యంగా.

"ఆదేమిటే! ఒక్కో పోజులో దేవానంద్‌లా, షమ్మీలా ఉన్నాడంటావుగా!" అంది లలిత బుంగమూతి పెట్టి.

"అవును! అంటే, అంతకంటె అందగాడు భూలోకంలో లేడని అర్థమా?"

"కాదనుకో! అయినా మన క్లాసు బ్యూటీ అవునా, కాదా?"

"ఛ. వాడా! ఎప్పుడు చూసినా ఎండు మిరపకాయలా చిరుబురులాడే మొహం వాడూను! కనిపించదు గాని నాచురల్ బ్యూటీ సుబ్బారావుది."

"ఛీ! దిబ్బ రొట్టె మొహం వాడూను. పిచ్చుక గూడులాంటి హెయిర్ స్టయిలూ వాడూ. వాడిని చూస్తే నాకు అరిగిన అన్నం కూడా వాంతి వస్తుంది" అంది లలిత ఈసడింపుగా.

"అయితే అందం గురించి అంతే తెలుసన్న మాట నీకు."

"ఆహా! అక్కడకు బ్యూటీ రీసెర్చిలో పిహెచ్. డి. పుచ్చుకున్నట్లు మాట్లాడకు."

ఇంతలో రామారావు సైలెన్సు అని డస్టరు టేబులుపై ప్రయోగించడంతో ఆగిపోయారు.

"ఏమో! అంతగా పొగుడుతున్నావు. మారేజ్ చేసుకోరాదూ?" అంది జానకి అయిదునిమిషాలాగి.

"ఏం నువ్వు సుబ్బారావుని చేసుకుంటావేమిటి?" అంది లలిత వెక్కిరింపుగా.

"నీ దంతా విడ్డూరమే, తల్లీ! అతడే 'మోహనాంగుడు, మన్మథుడు' అని పొగిడేస్తుంటే, బ్యూటీ అంటే ఏమిటో చెప్పాను గాని, నీలాగా అతను క్లాసుకు రాగానే మురిసిపోలేదే!" అంది జానకి చిరుకోపంగా.

"నేను మాత్రం...అతను అందంగా ఉంటాడు కాబట్టే, ఉన్నమాటన్నానుగాని, అతన్నే పెండ్లాడతానని అనలేదుగా" అంది లలిత, మనస్సులో 'అంతకంటే అదృష్టం ఇంకేమి కావాలి?' అనుకుంటూ.

'సైలెన్సు' అన్నాడు రామారావు వాళ్ళవంక చురచురా చూస్తూ. మిగతా స్టూడెంట్సు కూడా చూశారు. లలిత సిగ్గుపడి తల డస్కులో దించుకుంది.

'ఛ. వీన్నాడేమో! అంత పెద్దగా అనిఉండకుంటే బాగుండేది' అనుకుంది.

జానకి ఏమీ ఎరగనిదానిలా మొహం పక్కకు త్రిప్పుకుంది.

"మిస్ జానకీ, మీకు సైలెన్సు అంటే వినిపించలేదా? లేక మీనింగ్ తెలీదా?" అన్నాడు రామారావు.

"ఏయ్ మిస్టర్, మాటలు జాగ్రత్తగా రానియ్! ఎవరు గొడవ చేశారో చూసే మాట్లాడుతున్నావా?"

"ఇప్పుడు గాదు. టెన్ మినిట్సు నుండి చూస్తున్నాను మీ ఇద్దరిని."

"ఇద్దరు అంటే ఇంకా ఎవరు కనిపించారేమిటి నీ కళ్ళకు?"

"మీరు, మీ బెంచ్ మేట్."

ఆ మాట విన్న లలిత మనస్సు చివుక్కుమంది. 'ఛ. అస లిదంతా దీనివల్లే జరిగింది. వెధవ మొంటాలిటీ ఇదీను. అతనేదో అడిగాడనుకో, ఇది మెదలకుండా కూర్చుండి చావగూడదూ? మొగరాయుడిలా ఎగురుతుంది!' అనుకుంది.

"మరి అది కూడా లిస్టులో ఉన్నప్పుడు మిస్ జానకి అని నన్నే పిలవటంలో మీ ఉద్దేశ్యం?" అంది జానకి. మిస్ జానకి దగ్గిర ఒత్తిపలుకుతూ, సాగదీస్తూ.

అనుకోని ఈ ప్రశ్నకు రామారావు కొంచెం తికమకపడ్డాడు. సమాధానం వెతుక్కోవలసి వచ్చింది. ఇంతలో లెక్చరర్ రావటంతో ఎవరి సీట్లలో వాళ్ళు సర్దుకున్నారు.

* * *

"నడక చూడు. నడకని చూసే మోహించాలిగాబోలు! రెండు జాడించేసరికి చచ్చినట్లు పడున్నాడు" అంది జానకి, ముందు నడుస్తున్న రామారావు నుద్దేశించి.

"పోవే, నీదంతా బడాయి. మొగరాయుడిలా ఎగురుతావు!"

"ఆహా. అతగాడికి లేని కోపం నీకు వచ్చిందేమే, కుమారీ! అయినా 'రామావతార, నా తప్పిదంబు గాచి, నన్ను బ్రోవుమా' అంటూ సాష్టాంగ పడాలేమిటి? నా వల్ల కాదు, తల్లీ, నీ ఫావరిట్ కనక నువ్వేమైనా చేస్తావేమోగాని."

"అబ్బ! మెల్లిగా మాట్లాడవే. నెలలు నిండినదానికి నీ అరుపు వినిపిస్తే డెలివరీ కూడా అవుతుంది. వింటాడనయినా ఉండదేం?"

"ఏమే వింటే? అతడంటే పడిఛస్తావు కాబట్టి నీ కా భయం."

రామారావు ఆ మాట వినటం, వెనక్కి తిరిగి చూడటం కూడా జరిగింది. సిగ్గుతో లలిత తల వంగిపోయింది.

"ఆహా! ఏమే, తల్లీ, మెడ వంగిపోతుంది! కొంచెం ఆగితే తల తీసుకుపోయి పాదాలమీద పెట్టేటట్లున్నావు. కొంపతీసి ఆసనాలు ప్రాక్టీసు చేస్తున్నట్లున్నావే చూస్తే! రేపే లవ్ లెటర్ వ్రాసేటట్లున్నావే! నాక్కూడా కొంచెం చెప్పమ్మా! మా చిట్టివి కదూ!" అంటూ లలిత గడ్డం పట్టుకు పైకెత్తింది. ఇంతలో ఇద్దరు విడిపోవలసిన జంక్షను రావటంతో, "పోవే" అంటూ విదిలించుకుని, రామారావు వంక ఓరగా చూస్తూ వెళ్ళింది.

* * *

పరీక్షలయ్యాయి. మళ్ళీ కొన్నాళ్ళ రామారావుని చూడటం పడనందుకు లలిత చాలా బాధపడింది.

ఉన్నట్లుండి లలిత ఇంట్లో ప్రత్యక్షమయి వెడ్డింగు కార్డు అందించింది జానకి.

"చి. రామారావుకు చి. సౌ. జానకినిచ్చి..." మిగతా అక్షరాలన్నీ మసకగా కనిపించాయి లలితకి.

"క్షమించు, లలితా! అతను, నేను ఎప్పుడో ప్రేమించుకున్నాం. మా ప్రేమను సీక్రెట్‌గా ఉంచాలనుకున్నాం. నువ్వతన్ని పొగుడుతూంటే లేని ఆశలు పెంచుకుంటావని వీలైనంతవరకు విమర్శిస్తూ వచ్చాను అతన్ని. క్షమిస్తావు కదూ."

జీవంలేని నవ్వు వెలిసి మాయమయింది లలిత పెదవులపై. ★